

ఎపిజిఎల్ఐ డిజిటల్ సేవలపై 8న సమావేశం

ఉద్యోగులు ఎపిజిఎల్ఒ ధ్రువీకరణ పాలసీ బాండులు పొందాలి

ప్రజాశక్తి-విజయనగరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత భీమ శాఖ డిజిటల్ సేవలపై సోమవారం జిల్లా ఖజనా కార్యాలయం పరిధిలోని డిడిఒలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజనా అధికారి ఆర్ఎఎస్ కుమార్, ఎపిజిఎల్ఒ శాఖ సహాయ సంచాలకులు శ్రీమతి జి.హైమవతి ఒక ప్రకటలో తెలిపారు. జిల్లా ఖజనా కార్యాలయం పరిధిలోని డిడిఒలంతా సోమవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా సమగ్ర ఫైనాన్సు కాంప్లెక్సులోని ఖజనా కార్యాలయంనకు హాజరు కావాలని కోరారు. డిడిఒల సిబ్బంది యొక్క ధ్రువీకరణ పాలసీ వివరాలు ఎపిజిఎల్ఐ బాండ్లు సంబంధిత ఉప ఖజనా అధికారుల ద్వారా పొందాలని తెలిపారు.

అమలుకు నోచని హామీలు

రాష్ట్రంలో అధికారంలోకి వస్తే మూతపడిన శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు, లచ్చయ్యపేట ఎన్.సి.ఎస్ చక్కెర పరిశ్రమను తెరిపిస్తామని 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగాను, ఎన్నికల సభలోనూ సిఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. హామీలు ఇచ్చిన ఐదేళ్ల తర్వాత ఎన్నికలు రావడంతో గతంలో ఇచ్చిన హామీలు ఎక్కడంటూ కార్మికులు, చెరకు రైతులు ప్రశ్నిస్తున్నారు. జ్యూట్ పరిశ్రమలు మూతపడడంతో 3,500మంది కార్మికులు రోడ్డున పడగా సుమారు 2500మంది రైతులు గోగుసాగుకు దూరమయ్యారు. చక్కెర పరిశ్రమ మూతతో 600 మంది రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు రోడ్డున పడగా 1500మంది చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మూతపడిన ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ

- పరిశ్రమల మూతతో వీధిన పడిన వందలాది మంది కార్మికులు
- చెరకు సాగుకు దూరమైన రైతులు
- వైసిపి, టిడిపి రెండింటిదీ ఒకటే వైఖరి
- పాదయాత్రలో ఇచ్చిన హామీలను మరచిన జగన్

ప్రజాశక్తి-బొబ్బిలి

వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించే జ్యూట్ పరిశ్రమలు టిడిపి, వైసిపి రెండింటి హయాంలోనూ మూత పడ్డాయి. టిడిపి హయాంలో శ్రీలక్ష్మి శ్రీనివాస, జ్యోతి జ్యూట్ మిల్లులు మూతపడగా, వైసిపి హయాంలో నవ్య జ్యూట్ మిల్లు మూతపడింది. ఈ మూడు మిల్లుల మూతతో 3,500 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఉపాధి కోల్పోయిన కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నారు.

చక్కెర పరిశ్రమ మూతతో ఉపాధికి గండి

లచ్చయ్యపేట చక్కెర పరిశ్రమ మూతపడడంతో కార్మికులు, చెరకు రైతులు ఉపాధికి గండి పడింది. చక్కెర పరిశ్రమలో 600మంది కార్మికులు పని చేసి జీవనోపాధి పొందేవారు. చక్కెర పరిశ్రమ కోసం చెరకు సాగు చేసుకుని 1500మంది రైతులు జీవనోపాధి పొందేవారు. పరిశ్రమ మూతతో వీరంతా ఉపాధి కోల్పోయి హోటళ్లు, షాపులలో పని చేసుకుని జీవనోపాధి పొందగా మరికొందరు ఇతర ప్రాంతాలకు భవన నిర్మాణ పనులకు వలస వెళ్లిపోయారు. కొంతమంది రైతులు చెరకు సాగుకు దూరమవ్వగా మరికొందరు రైతులు చెరకు సాగు చేసుకుని బెల్లం క్రషర్లకు, సంకిలి చక్కెర పరిశ్రమకు చెరకు సరఫరా చేస్తున్నారు.

కార్మికులకు, రైతులకు ద్రోహం

రాష్ట్రంలో వైసిపి, టిడిపి కార్మికులకు, రైతులకు తీవ్ర ద్రోహం చేస్తున్నాయి. టిడిపి హయాంలో మూతపడిన శ్రీలక్ష్మి శ్రీనివాస, జ్యోతి జ్యూట్ మిల్లులను తెరిపిస్తామని, ఎన్.సి.ఎస్ చక్కెర పరిశ్రమ కార్మికులు, రైతులను ఆదుకుంటామని పాదయాత్ర, ఎన్నికల సభలో సిఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ ఆదిశగా ప్రభుత్వం అడుగులు వేయలేదు. పైగా అప్పటికే నడుస్తున్న నవ్య జ్యూట్ పరిశ్రమ, ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమలు పూర్తిగా మూతపడేందుకు సహకరించింది.

జ్యూట్ మిల్లు స్థలం అమ్మకంలో ఎమ్మెల్యేది కీలకపాత్ర

జ్యూట్ పరిశ్రమలు తెరిపిస్తామని హామీ ఇచ్చిన వైసిపి నాయకులే జ్యూట్ మిల్లు స్థలం అమ్మకంలో కీలకపాత్ర పోషించారు. అధికారం చేపట్టిన మిల్లులను తెరిపించకపోగా, శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మివేసేందుకు సహకరించారు. జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మివేసి కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ బకాయిలు చెల్లిస్తామని ఎమ్మెల్యే చెప్పినా, ఇప్పటికీ 1200మంది కార్మికులకు రూ. కోటి63లక్షలు పిఎఫ్ బకాయి చెల్లించలేదు. 55ఏళ్లు నిండిన 312మంది కార్మికులకు పిఎఫ్ పెన్షన్ అందడం లేదు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పిఎఫ్ బకాయిలు చెల్లించాలి



శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు కార్మికులకు పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి. ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన ఒప్పందాన్ని యాజమాన్యం అమలు చేయకపోయినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. జ్యూట్‌మిల్లులను తెరిపిస్తామని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయలేదు. ఒప్పందాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

వి.శేషగిరిరావు
ఆదర్శ కార్మిక సంఘం అధ్యక్షులు

టిడిపి, వైసిపిలకు చిత్తశుద్ధి లేదు



జ్యూట్ పరిశ్రమలు, చక్కెర పరిశ్రమ లను తెరిపించే ందుకు టిడిపి, వైసిపిలకు చిత్తశుద్ధి లేదు. ఏపార్టీ అధికారంలో ఉన్నా పరిశ్రమలు మనుగడ కోసం పని చేయడం లేదు. పరిశ్రమల మూతతో కార్మికులు రోడ్డున పడడంతో పాటు రైతులు కూడా ఉపాధి కోల్పోతున్నారు. పరిశ్రమలను తెరిపించి కార్మికులు, రైతులను ఆదుకోవాలి.

సింగిరెడ్డి గోపాలం,
రైతు సంఘం జిల్లా అధ్యక్షులు



మూతపడిన నవ్యా జ్యూట్‌మిల్లు

కార్మికులకు దగా చేస్తున్న టిడిపి, వైసిపి



జ్యూట్, చక్కెర కార్మికులకు టిడిపి, వైసిపి దగా చేశాయి. మూతపడిన పరిశ్రహలను ఈ రెండు పార్టీలూ తెరిపించలేదు. కార్మికుల ప్రయోజనాలు కంటే యాజమాన్యాల ప్రయోజనాల కోసమే ఈ రెండు ప్రభుత్వాలూ పనిచేవాయి. మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు ఇప్పటికైనా చిత్తశుద్ధితో పనిచేయాలి .

పి.శంకర్రావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

15లోగా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు

హోం ఓటింగ్ బృందాలను సిద్ధం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల విధులను నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది అంతా పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 15వ తేదీలోగా ఫారమ్-12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సెక్టార్ అధికారులు, రవాణా సిబ్బంది, డ్రైవర్లు, వీడియో గ్రాఫర్లు తదితర సిబ్బందికి కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోస్టల్, రైల్వే, పోలీస్ తదితర 33 అత్యవసర సేవల విభాగాల సిబ్బందికి కూడా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్లు, ఓటింగ్ ప్రక్రియకు చేయాల్సిన ఏర్పాట్లు, హోం ఓటింగ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల స్క్రూటినీ పూర్తయిన 48 గంటల్లోగా పోస్టల్ బ్యాలెట్ల పత్రాల ముద్రణ పూర్తి కావాలని ఆదేశించారు. మే 5,6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. దీనిపై ఆర్ఒల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బంది ఇబ్బంది పడకుండా, తగిన వసతి, మౌలిక సౌకర్యాలు ఉన్నచోట్ల ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలను బయటకు ఇవ్వకూడదని, అక్కడికక్కడే జారీ చేసి, ఓటింగ్ పూర్తి చేయించాలని స్పష్టం చేశారు. హోమ్ ఓటింగ్‌కు వచ్చిన దరఖాస్తులను బట్టి, ఇంటికి వెళ్లి ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన బృందాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్లను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములను కూడా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఆర్ఒలు, నోడల్ అధికారులు, తాహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

200 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వాహన తనిఖీల్లో భాగంగా 200 కేజీల గంజాయి పట్టుబడినట్లు సిఐ వై. మురళి తెలిపారు. పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్ వద్ద ఎస్ఐ సిహెచ్ గంగరాజు తన సిబ్బందితో శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అరకు వైపు నుండి ఎస్.కోట వైపు వస్తున్న బొలోరో వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించామని, అందులో 200 కేజీలు గంజాయి పట్టుబడిందని తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కైలాష్ చంద్ర బలాయ్, మహావీర్ కుమార్ జోట్, శివ లాల్ జోట్ అనే ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఎస్ఐ సిహెచ్ గంగరాజు పాల్గొన్నారు.



ఇంటి బయట కాపలా కాస్తున్న కానిస్టేబుళ్లు

సిఐటియు నాయకులు సుధారాణి గృహ నిర్బంధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు నెలలు తరబడి సిఐటియు ఆధ్వర్యాన పోరాటం చేస్తున్నారు. యాజమాన్యం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించకుండా పోలీసులను ఉపయోగించి అరెస్టులకు పాల్పడింది. సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేయించడం, గృహనిర్బంధం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. శనివారం విజయనగరంలో సిఐటియు నాయకురాలు బి.సుధారాణిని ఇంటి నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు. ఇంటి బయట పోలీసులు కాపలా కాశారు.

20న ఏకలవ్య ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐడిబిఐ పరిధిలో ఉన్న భామిని, మెళియపుట్టి ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 20న ప్రవేశ పరీక్ష మార్చబడిందని డిడి అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న నిర్వహించు ప్రవేశపరీక్ష ఈనెల 20కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఏకలవ్య గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల మిగిలిన సీట్లకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

టెన్త్ మూల్యాంకనాన్ని పరిశీలించిన ఆర్‌జెడి



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జరుగుతున్న 10వ తరగతి మూల్యాంకనను విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్ శనివారం పరిశీలిం చారు. మూల్యాంకనం జరుగుతున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయడాన్ని అభినందించారు. ఆర్‌జెడితో పాటు డిఇఒ ప్రేమ్‌కుమార్ , డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ యన్‌టి నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సన్యాసిరాజు పాల్గొన్నారు.

ప్రతీ ఓటరును గుర్తించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతి ఓటరును గుర్తించి తమకు అనుకూలంగా మలచుకోవాలని టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శనివారంవార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్ అభ్యర్థులు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు వెరిఫికేషన్, కుటుంబ సాధికార సారధుల నియామకం, 85 ఏళ్లు దాటిన ఓటర్లను గుర్తించి వివరాలు సేకరించడం, డబుల్ ఎంట్రీ ఓటర్లు గుర్తించి పార్టీ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, నియోజకవర్గ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

ఓటు చీలకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదితి విజయలక్ష్మి గజపతి

దళితుల ఓట్లు చీలకుండా చూడాలని రాష్ట్ర ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు మామిడి రవిశంకర్ అన్నారు. శనివారం అశోక్ బంగ్లాలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఎన్నికలలో ఎస్‌సిసెల్ తరపున ప్రచార కార్యక్రమం ఏ విధంగా నిర్వహించాలనే అంశాలపై చర్చించారు. నియోజకవర్గం అధ్యక్షుడు గొండేల ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు పైడిరాజు, ప్రధాన కార్యదర్శి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, స్వయం సహాయ సంఘాల మహిళలు

ఓటు ప్రాముఖ్యతను గ్రహించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు ప్రాముఖ్యతను తెలుసుకొని, వచ్చే ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. స్వీప్ కార్యక్రమ ంలో భాగంగా విజయనగరం పట్టణంలో డ్వాక్రా మహిళలతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్థంభం మీదుగా రాజీవ్ క్రీడా మైదానం వరకు ఈ ర్యాలీ జరిగింది. అనంతరం ఓటు అన్న అక్షరాలతో మానవ హారాన్ని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం జెసి కార్తీక్ మాట్లాడుతూ, ఓటు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు స్వీప్ కార్యక్రమం కింద వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మే 13 వరకు స్వీప్ కార్యక్రమాలను వివిధ రూపాల్లో కొనసాస్తామని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, ఎన్నికల్లో మహిళలంతా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, సహాయ కమిషనర్ తిరుమలరావు, స్వీప్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస రావు, మెప్మా పిడి సుధాకరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా క్వారీల తనిఖీ

- ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- విచారణకు ఆదేశించిన అధికారులు

ప్రజాశక్తి భోగాపురం

మండలంలోని రామచంద్ర పేట సమీపంలో ఉన్న క్వారీలపై రెవిన్యూ, సర్వే, మైనింగ్ అధికారులు శనివారం ఉమ్మడి గా తనిఖీలు నిర్వహించారు. గత కొన్ని రోజుల నుంచి క్వారీల వ్యవహారంపై రామచంద్ర పేట గ్రామస్తులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అంతేకాక ఇటీవల గ్రామ పెద్దలు జిల్లా కేంద్రంలో కలెక్టర్, మైనింగ్, పొల్యూషన్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో జిల్లా కేంద్రంలో మైనింగ్, సర్వే అధికారులతో పాటు స్థానిక తహశీల్దార్ శ్యాం ప్రసాద్ 5 క్వారీలను గ్రామస్తుల సమక్షంలోనే తనిఖీ చేశారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేయనున్నారు. గ్రామ సమీపంలోని ఐదు క్వారీల్లో గ్రామస్థుల సమక్షంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనిల్ క్వారీలో ఎంత లోతు లో తవ్వారో కొలతలు తీసుకున్నారు. జిఎంఆర్ కొత్తగా పనులు ప్రారంభించిన క్వారీ నుంచి గ్రామంలోని పాఠశాల వరకు ఎంత దూరం ఉందో కొలతలు వేసారు. గ్రామానికి ఎంత దూరంలో ఈ క్వారీలు ఉన్నాయనేది కూడా కొలతలతో సహా పరిశీలించారు. ఉన్నత అధికారులకు నివేదిక ఇచ్చిన తర్వాత కొన్ని ప్రారంభించాలని జిఎంఆర్ సిబ్బందికి అధికారులు ఆదేశించారు. కొండరాజుపాలెం పంచాయతీ సమీపంలో ఉన్న నర్సింగ్ రావుక్వారీని కూడా అధికారులు పరిశీలించారు. ఈ క్వారీ వలన తాగునీరు కలుషితమవుతుందని తాగునీటి బోర్లను అధికారులకు గ్రామస్తులు చూపించారు. మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు



రామచంద్రపేటలో క్వారీలను పరిశీలిస్తున్న అధికారులు

తనిఖీ నివేదిక కలెక్టర్‌కు అందజేస్తాం

రామచంద్ర పేట సమీపంలోని క్వారీలను మైనింగ్, సర్వే అధికారులతో గ్రామ పెద్దల సమక్షంలో తనిఖీలు చేశామని తహశీల్దార్ పి.శ్యాం ప్రసాద్ తెలిపారు.మైనింగ్ అధికారులు ఇచ్చే నివేదికను కలెక్టర్ కు అందజేస్తామని చెప్పారు.

వాలంటీర్ల 'రాజీ' నామాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లాలో గ్రామ, వార్డు వాలంటీర్ల రాజీనామాలు చర్చ నీయాశంగా మారాయి. వాలంటీర్లంతా రాజీనామాలు చేయండి, తిరిగి వైసిపి అధికారంలోకి వస్తే తిరిగి అవకాశం కల్పిస్తాం అంటూ వైసిపి నాయకులు, అక్కడక్కడా అభ్యర్థులు పిలుపునిస్తున్నారు. ఈ పిలుపును అందుకున్న వాలంటీర్లు అక్కడక్కడా రాజీనామాలు చేస్తున్నారు. మరికొందరు రాజకీయ ఒత్తిళ్లతో చేస్తున్నారు. రాజీనామాలు చేయడం ద్వారా ఎన్నికల్లో వైసిపికి మద్దతుగా ప్రచారం చేయవచ్చనేది వారిభావన. కానీ, ఇలా రాజీనామాల వరకు వెళ్లినవారు ఎంత మంది? రాజీనామా చేయకపోతే వైసిపిపై అభిమానం లేనట్టేనా? ఆ మాటకొస్తే ఇంకా రాజీనామాలు చేయనివారే ఎక్కువ. ఈ లెక్కన వైసిపికే ఎక్కువ నష్టం జరుగుతుంది కదా? ఇదీ విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ప్రస్తుతం పబ్లిక్ టాక్. వాలంటీర్ల ముసుగు తొలగించుకోండి అంటూ వైసిపి నేతలు బాహాటంగా చెప్తున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 15,478 మంది గ్రామ, వార్డు వాలంటీర్లు ఉన్నారు. వీరి నియామకం సమయంలో రాజకీయ జోక్యం ఉన్నప్పటికీ నూటికి నూరు శాతం వైసిపికి చెందినవారు అని చెప్పలేం. చాలా చోట్ల డబ్బులు తీసుకుని మరీ వాలంటీర్ల నియామకాలు చేశారు. బంధుత్వాల వల్ల కూడా టిడిపికి చెందినవారికి కొన్నిచోట్ల అవకాశం కల్పించాల్సి వచ్చింది. ఇటువంటి నేపథ్యంలో వాలంటీర్లు కేవలం వైసిపి వైపు మాత్రమే ఉండే పరిస్థితి లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈనేపథ్యంలోనే పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం కిమ్మి, గడగమ్మ గ్రామాల్లో 28మంది వాలంటీర్లు శనివారం రాజీనామాలు చేశారు. ఇటు విజయనగరం జిల్లాలో పూసపాటిరేగ మండలంలో రెల్లివలస, కుమిలి సచివాలయాల పరిధిలో 77మంది, భోగాపురం మండలం సవరవిల్లి 18మంది చొప్పున వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అంతకు ముందు బొబ్బిలి పట్టణం 30వ వార్డులో 12మంది, విజయనగరంలోనూ నలుగురు రాజీనామాలు చేశారు. విజయనగరంలో 14మంది, ఎల్.కోట మండలం ఖాసాపేటలో ఒకరు, దత్తిరాజేరు మండలం వంగరలో ఒకర్ని చొప్పున ఎన్నికల నిబంధనవాళి ఉల్లంఘించినందుకు అధికారులు విధులనుంచి తప్పించారు. మొత్తంగా ఇప్పటి వరకు 200మంది లోపే రాజీనామాలు చేశారు. రాజీనామాల సంఖ్య ఇంకా పెరగొచ్చు. కానీ, ఇవేవీ రాజకీయాలను ఊహకు అందని రీతిలో ప్రభావితం చేసే పరిస్థితి ఉంటుందా? ఇదే నిజమైతే ఎవరి పాలనలో ఎక్కువ ఉపాధి అవకాశాలు దొరికితే వారికే ఎక్కువ మంది పనిచేస్తారు. ఈలెక్కన టిడిపి సుదీర్ఘ ప్రయాణంలో దశాబ్దాలు తరబడి పాలించింది. ఆయా సందర్భాల్లో ఉద్యోగాలు తెచ్చుకున్నవారంతా ఆ పార్టీకే ఓట్లు వేస్తారా? అన్నది చాలా మంది నోట వినిపిస్తున్నమాట. కాబట్టి ఇటువంటి రాజీనామాలు మాంసం తిన్నామని చెప్పుకోవడం కోసం దుమ్ములు మెడలో కట్టుకోవడం వంటిదే అనేది పబ్లిక్ టాక్.

కారులో రూ.9 లక్షలు నగదు పట్టివేత

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని మోదవలస చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం రాత్రి కారులో తరలిస్తున్న రూ.9 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. విశాఖ నుండి విజయనగరం వెళ్లే రహదారిలో మోదవలస వద్ద అధికారులు ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. తనిఖీల్లో భాగంగా విశాఖ నుంచి ఒరిస్సా వెళ్తున్న కారును తనిఖీ చేయగా రూ.9లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. ఒరిస్సాకి చెందిన సంబంధిత యజమాని సాయి సోమనాథ్ పాండే సరైన ఆధారాలు చూపించకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సంతకాలకే పరిమితమైన సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా సంతకాలకే పరిమితమైంది. ఈ సమావేశానికి ఎంపిపి డి.సత్యవంతుడు, ఎంపిడిఒ నిశ్చల పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోడ్ నిబంధన పాటించాలని, వడగాల్పుల బారిన పడకుండా ప్రజలకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సత్యం, ఇఒపిఆర్‌డి, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో 'జయహో బిసి'

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని బీమవరం గ్రామంలో శనివారం జయహో బీసీ సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కొప్పల వెలమ బిసి సాధికార కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, మండల అధ్యక్షులు తెంటు రవిబాబు మాట్లాడుతూ బీసీ డిక్లరేషన ద్వారా 50 ఏళ్లకే పింఛనను టిడిపి ప్రకటించడాన్ని బీసీలందరూ గుర్తించాలన్నారు. ప్రతి కార్యకర్త అంకితభావంతో, కసితో పనిచేసి పార్టీ గెలుపులో పాలు పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. టిడిపి విజయ సంకల్పయాత్రలో భాగంగా గ్రామ పరిధిలోని బీసీ కాలనీలో ప్రచారం నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి భాస్కర్ రావు, చప్ప తిరుపతి రావు తుదితరులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కోటమ్మ తల్లి ఆదాయం రూ.3.36లక్షలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు కొట్టాం కోటమ్మ తల్లి పండగ సందర్భంగా సిరిమాను సంబరం జరిగిన విషయం తెలిసిందే. కాగా ఈ పండగ ఆదాయాన్ని కోటమ్మ తల్లి ఆలయ ఈవో నాగేంద్ర ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో నాగేంద్ర మాట్లాడుతూ అమ్మవారి హుండీ ద్వారా రూ.3,36,229 నగదు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆలయ చైర్మన్ రమణ బాబులు పర్యవేక్షించారని ఆయన తెలిపారు.

నేడు మండల స్థాయి విస్తృత సమావేశం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని సిరికి రిసార్ట్‌లో ఆదివారం వైసిపి మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి బొత్స సత్యనారాయణ హాజరవుతారని మండలంలో ఉన్న ముఖ్య నాయకులు, జెడ్‌పిటిసి, ఎంపిపి, మండల నాయకులు, జెసిఎస్ కన్వీనర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాలని కోరారు.

పాటతో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు

ఆడియో ఆవిష్కరణలో గురాన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా చైతన్యం కోసం మూడు దశాబ్దాలుగా కాళ్లకు గజ్జలు కట్టుకొని, చేతిన డప్పు వేసుకొని ప్రజలకోసమే గానం చేస్తున్న గొప్ప గాయకుడు, పాటల తూటా ఉదయ భాస్కర్ అని గేట్ అధ్యక్షులు గురాన అయ్యలు అన్నారు. శనివారం జిఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ హోటల్‌లో ఆదాద మోహనరావు అధ్యక్షతన ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, బటన్ నొక్కి బతుకులు కూల్చారని, 28రకాల సంక్షేమ పథకాలను తొలగించి పేదలను మోసం చేశారంటూ తన పాటలో ఉదయ భాస్కర్ వివరించారని అన్నారు. ప్రజలు చైతన్యమై ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొంత్రింకి వెంకటరమణ, గోరా రమేష్ బాబు, అల్లి శివ ప్రసాద్, బెలగాన దేవదాస్, దప్పరాజు, బోనెల సన్యాసిరావు, గంట వీర్రాజు పాల్గొన్నారు.

స్తంభాన్ని సరిచేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక చినబజారు జంక్షన్‌లో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు. స్తంభం పాడైపోయి రోడ్డుపైకి ఒరిగిపోయింది. స్తంభం ఎప్పుడైనా పడిపోయే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని, బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులు స్పందించి స్తంభాన్ని సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పూర్తిగా ఒరిగిపోయిన స్తంభం


సామగ్రి ధ్వంసం చేస్తున్న పోలీసులు

సారా తయారీ సామాగ్రి నేలమట్టం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలో చందాపురం గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రం వద్ద శనివారం ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ సిబ్బందితో కలిసి వెళ్లి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటలు, ఇతర సామాగ్రిని నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ సారా వ్యాపారం చట్ట విరుద్ధమని, మద్యం గొలుసు దుకాణాల నిర్వహణ, బహిరంగ మద్యపానం వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని పట్టుబడితే ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

మద్యంతో వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి - బొబ్బిలి

బాడంగి మండలంలోని గొల్లాది గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపునకు తరలిస్తున్న మద్యాన్ని పట్టుకుని సీజ్ చేసి వ్యాపారి ఎం.ఆనందరావును అరెస్టు చేసినట్లు ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ బివి మురళీధర్ చెప్పారు. గొల్లాది గ్రామానికి చెందిన ఆనందరావు మోటారు సైకిల్‌పై మద్యం తీసుకు వెళ్తుండగా గ్రామ సమీపంలో పట్టుకుని 104 మద్యం సీసాలను, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఆనందరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడిలో ఎస్ఐలు ఎస్‌వి రామారావు, ఎల్.తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ముఖ్యంగా టిడిపి,జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థులు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని కూటమి అభ్యర్థులు చెప్పగా, ఇప్పటికే తాము చేసిన అభివృద్ధిని చూసి మరోసారి తమకు ఓటు వేయాలని వైసిపి అభ్యర్థులు ప్రజలను కోరుతున్నారు. కాగా జిల్లాలో ఎస్‌కోట నియోజకవర్గంలోనే స్వతంత్ర అభ్యర్థిగా గొంప కృష్ణ బరిలో దిగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తన సతీమణితో కలిసి గ్రామాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు.ఉదయం సాయంత్రం నాయకుల ప్రచారాలతో గ్రామాలు సందడిగా కనిపిస్తున్నాయి..


కొత్తవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కడుబండి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- కొత్తవలస

రాష్ట్రంలో అభివృద్ధి చూసి ఓటు వేయాలని, టిడిపి మిత్రపక్షాల కల్లబొల్లి మాటలు విని మోసపోవద్దని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి ఉత్తరాపల్లి, చిన్నిపాలెం గ్రామ పంచాయతీలలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక టిడిపి మిత్రపక్షాలు లేనిపోని అవాకులు, చవాకులు అల్లుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు నాయుడు విషం చిమ్ముతున్నారని విమర్శించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరిస్తూ తనను మరోసారి గెలిపించాలని కడుబండి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలనాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఉత్తరాపల్లి, చిన్నిపాలెం సర్పంచులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.


రేగిడి: సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు మురళి



కొత్తవలస: ప్రజలకు అభివాదం చేస్తున్న ఓటు అడుగుతున్న కోళ్ల

కోళ్ల ఎన్నికల ప్రచారం

కొత్తవలస: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే టిడిపి అధికారంలోకి రావాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి అన్నారు. మండలంలో శనివారం సాంబయ్యపాలెం, కొత్తూరు, అంబేద్కర్ కాలనీ, కొత్త సుంకరపాలెం, కంటకాపల్లి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడూతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు ఊపిలో పెట్టి అభివృద్ధిని మరిచిపోయిందని అభివృద్ధి జరగాలంటే తప్పకుండా టిడిపికి ఓటేయాలని కోరారు. టిడిపి హయాంలో పంచాయతీ బిల్డింగ్స్, సిసి రోడ్లు, తారు రోడ్స్, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, చంద్రన్న భీమా, పసుపు కుంకుమ, అన్న క్యాంటిన్, పెళ్లికానుక, ఆదరణ పథకం, బీసీలకి సబ్సిడీ లోన్స్, కళ్ళుగీత డప్పు కళాకారులకు పెన్షన్స్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపిగా భరత్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలదే

రేగిడి: రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రజలపై ఉందని, అందుకు ప్రతి ఓటరు గుర్తించుకుని విజ్ఞతతో రానున్న ఎన్నికల్లో వైకాపాను బంగాళాఖాతంలో కలపాలని మాజీ మంత్రి, టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళి కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని తాటిపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు రూపకల్పన చేసిన సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ పై ప్రజలకు వివరిస్తూ ప్రజలను ఆశీర్వాదించాలని కోరారు. అనంతరం 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించారు. కోండ్రు మాట్లాడుతూ యువత భవిష్యత్తు పై జగన్ దెబ్బకొట్టాడన్నారు. యువత ఎప్పుడూ పేదరికంలోనే ఉండాలని జగన్ కోరుకుంటున్నారని చెప్పారు. యువత భవిత మన బాబు బాధ్యత, యువత అంతా కలిసి చంద్రబాబు నాయుడుతో కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వేపాడ: గ్రామాల్లో ప్రచారం చేస్తున్న గొంప కృష్ణ దంపతులు

గెలుపు ఖాయం : గొంప

వేపాడ: స్వతంత్ర్య అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగుతున్న తాను 20వేల ఓట్లు మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని టిడిపి రెబల్ అభ్యర్థి గొంప కృష్ణ అన్నారు. మండలంలోని ఆయన స్వగ్రామంలో శనివారం మండల నాయకులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం చేపట్టారు. యువనేత గొంప కృష్ణ తన సతీమణి రమాదేవితో కలిసి శుక్రవారం రాత్రి నల్లబెల్లి, బోజింకివానిపాలెం, చిన్నగుడిపాల గ్రామాలలో ప్రచారం చేయగా శనివారం కుమ్మపల్లి, ఎ.కే.జీ పాలెం గ్రామాలలో ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ తొలిసారి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న తనను ప్రతి ఒక్కరూ ఆశీర్వాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేపాడ, కొత్తవలస, జామి మండల నాయకులు లగుడు రవికుమార్, గొరపల్లి రాము, గుమ్మడి భారతి, పైడిబాబు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పని చేసేందుకు గెలిపించండి


బొబ్బిలి: తనకు అవకాశం కల్పించాలని కోరుతున్న బేబినాయన

బొబ్బిలి: ప్రజా సమస్యలపై పని చేసేందుకు ఓట్లు వేసి తనను గెలిపించాలని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కోరారు. మున్సిపాలిటీలోని ఐటిఐ కాలనీలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైంద న్నారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థిం చారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, బాబు పాలూరి, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

రామభద్రపురం మండలంలోని నాయుడువలస పంచాయతీకి సంబంధించి నాయుడువలస, కొండపాలవలస గ్రామాల నుండి సుమారు 60 కుటుంబాలు శనివారం టిడిపిలో చేరాయి. కొండపాలవలస గ్రామం ప్రస్తుత వైసిపి ఉపసర్పంచ్ లెంక శ్రీనివాసరావు, వార్డు మెంబరు దువ్వు అప్పలస్వామి ఆధ్వర్యంలో బొబ్బిలి కోటకు వచ్చి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన సమక్షంలో టిడిపిలో చేరారు. టిడిపి నాయకులు మడక తిరుపతినాయుడు, కర్రోతు తిరుపతి రావు పాల్గొన్నారు.

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలస, కుమిలి-1, కుమిలి-2 సచివాలయాలకు సంబంధించి మొత్తం 77 మంది వాలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను స్థానిక ఎంపిడిఒ రాధికకు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరల ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాతే వాలంటీర్లగా సేవలు అందిస్తామన్నారు. రానున్న రోజుల్లో జగనన్న సైనికులుగా పనిచేసి ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. మండల జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎవరైతే రాజీనామా చేశారో వారందరిని జగన్ సిఎం అయిన తరువాత వాలంటీర్లుగా తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుమిలి వైస్ సర్పంచ్ సురేష్ రెడ్డి, పడాల శ్రీధర్ పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని సవరవిల్లి పంచాయతీ పరిధిలోని 18 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సచివాలయంలో శనివారం అందించారు. అయితే నాయకులంతా వాలంటీర్లను కలిసి రాజీనామ చేసి పార్టీ కోసం పనిచేయాలని కోరుతున్నట్లు తెలిస్తోంది.

జాకేరు వెల్ఫేర్ అసిస్టెంట్ ఉదార భావం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని జాకేరు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రేమ కుమార్ తన ఉదార భావాన్ని చాటుకున్నారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితు రాలకు అక్కడకు వెళ్లి శనివారం పింఛను సొమ్మునుఎ అందజేశారు. ఈ మేరకు ఆయన సేవలను పలువురు అభినందించారు.


పింఛను సొమ్మును అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్

వైద్య శిబిరాలు పేదలకు ఉపయోగం

ప్రజాశక్తి-విజయనగరం కోట

పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తిరుమల-మెడికవర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ తిరుమలప్రసాద్ అన్నారు. నగరంలోని పంచముఖ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డాక్టర్ తిరుమల ప్రసాద్ ప్రారంభించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వైద్య సేవలు వినియోగించు కున్నారు. వైద్య శిబిరం నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన ధార్మికవేత్త పెంటపాటి ముత్యాలరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో ఉచితంగా బిపి, షుగర్, రక్త పరీక్షలు, ఇసిజి ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు కూడా అందజేశా మన్నారు. పంచముఖ హనుమాన్ దేవాలయం కమిటీ ప్రతినిధి పెంటపాటి కామరాజు, కందాల సాయిబాబా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధి అల్లంకి బసవ మూర్తి, తిరుమల ఆసుపత్రి సెంటర్ హెడ్ పద్మ కుమార్, డాక్టర్ రెడ్డి సుధీర్ నాయుడు, డాక్టర్ అశ్విని రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ కేటి రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ తిరుమలప్రసాద్

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎస్‌కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులకు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ప్రస్తుత ఎస్‌కోట కోర్టును పట్టణంలోని శ్రీసాయికృష్ణ కళ్యాణ మండపంలోకి తాత్కాలిక అద్దె ప్రాతిపదికన మార్చేందుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వుల ప్రతిని నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరి దేముడు, కార్యవర్గ సభ్యులకు అందజేశారు. అద్దె భవనంలో తాత్కాలిక కోర్టును సక్రమంగా నిర్మించుకోవాలని న్యాయవాదులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎల్.అప్పారావు, కోశాధికారి బి.త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యు.ఎన్.శర్మ, మాజీ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, న్యాయవాదులు ఎన్‌టివి దాసు, గేదెల ప్రకాష్, టివిఆర్ మూర్తి, బి.రామకృష్ణ, బివిఎస్ రామారావు, సత్యనారాయణ, ముత్యాలనాయుడు పాల్గొన్నారు.


ఉత్తర్వుల ప్రతిని అందిస్తున్న జిల్లా జడ్జి

తూర్పుకాపులకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, తూర్పు కాపు ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే,ఎంపీ టికెట్లు తూర్పు కాపులకే కేటాయించాలని ఎపి తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారావు డిమాండ్ చేసారు. శనివారం విజయగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తూర్పు కాపు ఓటుబ్యాంకు ఎక్కువగా ఉందని, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో తూర్పు కాపులు అధికంగా ఉన్నారని అయినప్పటికీ ఏ రాజకీయ పార్టీ కూడా వారికి టికెట్లు కేటాయించకపోవటం దారుణమని అన్నారు. విజయనగరంలో అత్యధికంగా ఉన్న తూర్పు కాపులకు ఇన్నేళ్లుగా రాజకీయంగా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసారు. విజయనగరం నియోజకవర్గంలో ఇప్పటికీ 3 ఎన్నికల్లోనూ ఒసిలకే సీటు కేటాయిస్తున్నారని, బిసిలకు ఎందుకు కేటాయించటంలేదని ప్రశ్నించారు. ఎచ్చెర్ల నియోజక వర్గంలో ఎమ్మెల్యే టిక్కెట్ కలిశెట్టి అప్పలనాయుడుకు కేటాయించి ఎంపి టిక్కెట్ గేదెల శ్రీనిబాబుకు కేటాయించాలని, లేని పక్షంలో మీసాల గీతకు గాని, కర్రోతు బంగార్రాజుకు గాని ఎంపి టికెట్ కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎజ్జపురపు శ్రీను, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోపాడ అనిల్, జిల్లా అధ్యక్షులు రామ్మోహన్, సారిక మురళీమోహన్, ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాంత్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని సుందరాడ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇటీవలే అకాల మరణం చెందిన శ్రీకాంత్ కుటుంబానికి ఎంపిడిఒ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, మండలంలో ఉన్న అందరూ సచివాలయ సిబ్బంది కలిపి రూ.1.15లక్షలు ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అందరితో కలివిడిగా ఉంటే శ్రీకాంత్ మరణం తోటి ఉద్యోగులకు తీరనిలోటన్నారు.



శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఉద్యోగులు

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలి ఎన్నికల కమిషన్ సిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో జారీ కానున్న నేపథ్యంలో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లును సాధ్యమైన త్వరగా పూర్తి చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు పర్చాలని జిల్లా ఎన్నికల అధికారులను, పోలీస్ సూపరింటెండెంట్లను, పోలీస్ కమిషనర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్టంగా అమలు, ఎన్నికల ముందస్తు ఏర్పాటులను అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్ లు, పోలీస్ కమిషనర్లతో రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, కేసుల నమోదు తదితర అంశాలపై సిఇఒకు వివరించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత చెక్ పోస్టుల ద్వారా చేపట్టిన తనిఖీలు, సీజ్ చేసిన వస్తువులు, నగదు తదితర అంశాలపై జిల్లా ఎస్.పి. దీపిక పాటిల్ వివరించారు. సాధారణ ఎన్నికల నిర్వహణకు బందోబస్తు ఏర్పాట్లకు అవసరమైన భద్రత సిబ్బందిని సమకూర్చుకునే విషయమై వివరించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ ఎస్.డి. అనిత, ఆర్‌డిఒలు, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు

అచ్చెన్నాయుడు కుటుంబానికి అశోక్ పరామర్శ

ప్రజాశక్తి- విజయనగరం కోట

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శనివారం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ వెళ్లి అచ్చెన్నాయుడు కుటుంబీకులను పరామర్శించారు. ముందుగా కళావతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు ఉన్నారు.


కళావతమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మరంగా తనిఖీలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. రిటర్నింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. నాలుగు నియోజక వర్గాల్లో 48 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 36 స్టాటిక్ సర్వేలియన్ల బృందాలు, 16 వీడియో సర్వేలియన్స్ బృందాలు, 4 వీడియో వ్యూయింగ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాల పనితీరు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తాయని ఆయన చెప్పారు. ప్రజలు సమాచారాన్ని 1950 టోల్ ఫ్రీ నెంబరుతో సహా సి-విజిల్, ఆన్ లైన్ ఫిర్యాదుల విభాగంలో సైతం అందించవచ్చు అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తమ తనిఖీలు ముమ్మరం చేయాలని, ఎన్నికల ప్రలోభాలకు సంబంధించి ఎటువంటి రవాణా జరుగుతున్నా, కార్యకలాపాలు సాగుతున్న నిర్ణీత సమయంలో తనిఖీలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సి విజిల్ ఫిర్యాదులు పరిష్కారంలో మరింత వేగాన్ని పెంచాలని ఆయన స్పష్టం చేశారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద వెబ్ కాస్టింగ్ విధిగా చేయాలని ఆయన ఆదేశించారు. అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల వద్ద గట్టి నిఘా ఉండాలని, మద్యం, గంజాయి, ఇతర సామగ్రి రవాణాకు అవకాశం ఉందని ఆయన సూచించారు. ప్రచారాలకు రాజకీయ పార్టీలు సువిధ యాప్ ద్వారా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై చర్యలు

పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. శనివారం జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. గంజాయి, మద్యం, నగదు, ఉచితాల అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచాలని, రాష్ట్రాల సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్ పోస్ట్‌లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. జప్తు సమయంలో వ్యాపారులు, సాధారణ పౌరుల విషయంలో ఆచీతూచీ అడుగువేయాలని, వారిని ఎటువంటి ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు.